సామెత (జాతీయముల )కథలు

## తెర వెనుక భాగవతము

**- శ్రీ మునునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.**

పూర్వం ప్రజలు వినోద కార్యక్రమాల ద్వారా విజ్ఞానోపార్జన చేస్తూండే వారు. అట్టి వాటిలో వీధి భాగవతాలు, కూచిపూడి నాట్యాలు, తోలు బొమ్మలాటలు, యక్ష గానాలు వంటివి అనేకములు కలవు. వీటిద్వారా కొందరికి బ్రతుకు తెరువు అయ్యేది. వీరు భారత భాగవత రామాయణాది పురాణ గాధలను సుమధురంగా గానం చేస్తుండేవారు.

మూడు వైపుల దడి, నాల్గవ వైపు ముఖ భాగమున తెల్లని తెరగట్టి, వెనుక నుండి తోలు బొమ్మలను నేర్పుగా ఆడిస్తూ పాడుతూండేవారు. వాండ్రు నాల్గు వీధుల మొగను ప్రదర్శన మిచ్చునప్పుడు నాల్గు విధుల జనులు చూచి ఆనందించు చుండిరి. అందు వచ్చే పాత్రలనేకమైనప్పటికి కేవలం ముగ్గురు నలుగురు చేతనే ప్రదర్శన జయప్రదంగా జరిగేది. తెరవెనుక నుండే వాండ్రు ఏ విధంగా ఉన్నా, ప్రదర్శన మాత్రం చెవుల కింపుగా కన్నుల పండువుగా ఉండేది. అవి రాను రాను రంగస్థల నాటకాలుగా రూపొందినవి. ఆపై అనగా నేడు తెర్పై భాగవతములు గాను ప్రదర్శింపబడు చలన చిత్రముల పేరున పిలువబడుచున్నవి. తమిళ దేశ ప్రాంతమున తోలు బొమ్మలకు బదులు తెర వెనుక దూది గుడ్డలు మున్నగు సామాగ్రి తోలు బొమ్మలుగా జేసి ఆడించుచున్నారు. తెర వెనుక నుండి ఆడెడు భాగవత కథయని దీని భావము. లోపల జరిగే కుతంత్రము వెల్లడి కానపుడు తెరవెనుక భాగవతమను పేరు ప్రసిద్ధికెక్కినది.

## బ్రహ్మ రథము

బ్రహ్మజ్ఞానులైన పరమ హంసలు మఠాధిపతులు, పీఠాధిపతులు పరమ పదించి, బ్రహ్మసాయుజ్యము పొందునపుడు, వారి భౌతిక దేహమును బ్రహ్మచారులు, బ్రహ్మవాదులు అగు శిష్యులు మాత్రమే సమాధికై కొనిపోవుదురు. బ్రహ్మజ్ఞానులగు నట్టివారి ప్రాణ వాయువు బ్రహ్మరంధ్రముద్వారా పోవును. వారిని బ్రహ్మారణ్యమున మాత్రమే సమాధి చేయుదురు. బ్రహ్మణ్యులైన వేద పండితులు బ్రహ్మాంజలి బద్ధులై వేదము స్వస్తి చెప్పుదురు. ఆ దేహము కాలము ప్రదేశము సర్వము బ్రహ్మమయమై నిండి యుండును. బ్రహ్మ విదులు మాత్రమే మోయునట్టి ఈ శవయానమునకు బ్రహ్మ వాహనమని, బ్రహ్మ రథమని పేరు కల్గెను.

ఎవరైనా ఊహించని విధముగా ఆతిధ్యము ఇచ్చినపుడు, బ్రహ్మరథము పట్టేరని అనడం పరిపాటి.

*